# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-09-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **సెమీ కండక్టర్ల ఉత్పత్తికి భారత్‌ను భౌగోళిక కేంద్రంగా మలిచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**
2. **ఏలూరు జిల్లాలో వర్షాలకు దెబ్బతిన్న కొల్లేరు పరివాహక ప్రాంతాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు విహంగ వీక్షణం ద్వారా పరిశీలించారు.**
3. **కాకినాడ జిల్లా ఏలేరు వరద ఉధృతిపై జిల్లా కలెక్టర్, అధికారులతో ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు.**
4. **వరద ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ పూర్తి స్థాయిలో వైద్య సేవలందిస్తుందని ఆ శాఖా మంత్రి సత్యకుమార్ తెలిపారు.**
5. **తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 7గురు మృతి చెందారు.**

==========================

సెమీ కండక్టర్ల ఉత్పత్తికి భారత్‌ను భౌగోళిక కేంద్రంగా మలిచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో మూడు రోజుల పాటు జరిగే సెమికాన్ ఇండియా 2024 సదస్సును ప్రధానమంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ మాట్లాడుతూ, భారత్‌లో సెమి కండక్టర్ల రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను అందిస్తుందని తెలిపారు. 21వ శతాబ్దపు ప్రపంచానికి భారత్ భరోసాగా నిలుస్తోందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

...వాయిస్...42 సెకన్లు

సెమీ కండక్టర్ల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు అనే ఇతివృత్తంతో జరిగే ఈ సమావేశాలను ఈ రోజు నుంచి ఈనెల 13 వరకు నిర్వహించనున్నారు.

---

ఏలూరు జిల్లాలో వర్షాలకు దెబ్బతిన్న కొల్లేరు పరివాహక ప్రాంతాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు విహంగ వీక్షణం ద్వారా పరిశీలించారు. అలాగే రహదారి మార్గంలో తమ్మిలేరు వరద ప్రవాహాన్ని పరిశీలించి.. కొల్లేరు, ఉప్పులేరు, తమ్మిలేరు వరదలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...

..వాయిస్...28 సెకన్లు

---------------------------

కాకినాడ జిల్లా ఏలేరు వరద ఉధృతిపై జిల్లా కలెక్టర్, అధికారులతో ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. వరద పరిస్థితిపై ఫోనులో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఏలేరు వరద కారణంగా కాకినాడ జిల్లా వ్యాప్తంగా 62 వేల ఎకరాల పంట నష్టం జరిగిందని తెలిపారు. పరివాహక ప్రాంతాల్లో పలుచోట్ల గండ్లు పడి రహదారులపై నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం కలిగిందన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆహారం, నీరు, పాలు అందించాలని పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.

---------------------------

వరద బాధితుల్లో మానసిక స్థైర్యాన్ని కలిగించేలా వైద్యులు సేవలందించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ కోరారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులతో మంత్రి సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ వైద్య కళాశాలల యాజమాన్యాలు వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవలందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. వరద బాధిత ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖ పూర్తి స్థాయిలో వైద్య సేవలందిస్తుందని తెలిపారు. వార్డుకో బృందం చొప్పున వైద్యులు సేవలందిస్తారని, దీన్ని బాధిత కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.

---------------------------

ప్రధానమంత్రి ఆవాస్ యోజన –పీఎంఏవై గ్రామీణ్ పథకం కింద గృహ నిర్మాణాలను చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. పీఎంఏవై గ్రామీణ్ 2.0ను ఈ నెల 15న ప్రారంభించనున్న సందర్భంగా కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి నిన్న అన్ని రాష్ట్రాల గృహనిర్మాణశాఖ మంత్రులు, అధికారులతో దృశ్య మాధ్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్ధసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పీఎంఏవై గ్రామీణ్ కింద చేపడుతున్న ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నగదు మొత్తాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సాయాన్ని పెంచితే లబ్ధిదారులకు మేలు జరుగుతుంది అని తెలిపారు.

---------------------------

స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించేందుకు ఈ నెల14 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు 'స్వభావ్ స్వచ్ఛత- సంస్కార్ స్వచ్ఛత' పేరిట కార్యక్రమాలను నిర్వహించనున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఒకేసారి పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించడం, ప్రత్యేకించి ఆహార పదార్థాలు అమ్మే వీధి దుకాణాల వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు అమలు, పారిశుద్ధ్య కార్మికుల వైద్య సంక్షేమానికి ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలపై ఆయా రోజుల్లో సంబంధిత అధికారులు వివిధ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

మరోవైపు 'స్వభావ్ స్వచ్ఛత – సంస్కార్ స్వచ్ఛత' కార్యక్రమంలో భాగంగా అనంతపురం జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతా హి సేవ ర్యాలీలు, మారథాన్ రన్, కార్యశాలలు వంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు.

---------------------------

తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం, చిలకావారి పాకలు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 7గురు మృతి చెందారని అధికారులు తెలిపారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై విచారణ జరుపుతున్నామని తెలిపారు. ఈ ఘటనపై రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారుల్ని మఖ్యమంత్రి ఆదేశించారు.

---------------------------

ప్రకాశం జిల్లాలో ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా–పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలలు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యా శాఖాధికారి డి. సుభద్ర పేర్కొన్నారు. నిన్న ఒంగోలులో జిల్లాలోని పిఎంశ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారిలతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ, పీఎంశ్రీ పథకంలో ఎంపికైన పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మంజూరైన నిధులతో క్రీడా మైదానం, రసాయన పరిశోధనశాలలు వంటి సదుపాయాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వ కర్మ యోజన పథకంలో అర్హులను లబ్దిదారులుగా నమోదు చేసేందుకు ప్రజలలో అవగాహన కల్పిస్తున్నామని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. జిల్లాలో విశ్వ కర్మ యోజన పథకం అమలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ ఈ రోజు దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి విశ్వ కర్మ యోజన పథకం కింద 18 రకాల చేతి వృత్తుల వారికి ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ పథకం కింద ఎంపికై ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు మొదటి విడతలో రుణాలను అందించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

---------------------------

దేశంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని కేంద్ర పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి పేర్కొన్నారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని కుటుంబ సభ్యులతో కలసి కేంద్ర మంత్రి ఈరోజు దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల కేంద్ర మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో వరద బాధితులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

---------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో దసరా ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. నిన్న ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డు మార్గంలో నిర్మిస్తున్నరక్షణ గోడ పనులను మంత్రి పరిశీలించి, నిర్మాణ పనుల పురోగతి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా దేవస్థానం అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొండపై నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

దేశవ్యాప్తంగా ప్రస్తుతం అమలవుతున్న ఏడవ జాతీయ పోషణ మాసోత్సవంలో భాగంగా ఇప్పటివరకు ఒక కోటి 79 లక్షలకు పైగా పోషణ కార్యక్రమాలను నిర్వహించినట్లు కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల ఒకటవ తేదీన ప్రారంభమైన పోషణ మాసోత్సవాలు ఈనెల 30వ తేదీ వరకు కొనసాగనున్నాయి. దేశవ్యాప్తంగా పోషకాహారానికి సంబంధించిన అనేక అంశాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. రక్తహీనత పెరుగుదల, పర్యవేక్షణ, పోషకాహారం వంటి అంశాలతో పోషన్ భీ –పడాయి భీ అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేసున్నారు. వీటితో పాటు ఏక్ పేడ్ మా కే నామ్ అనే కార్యక్రమం ద్వారా 13 లక్షల 95 వేల అంగన్వాడి కేంద్రాల్లో మొక్కల పెంపకాన్ని చేపట్టారు.

======================